నవల

# బుగతలనాటి చుక్కపల్లి

చింతకింది శ్రీనివాసరావు



Bugathalanaati Chukkapalli

*Novel*

*by* Chintakindi Srinivasa Rao

Copy rights © Writer

*First Edition:*
2019

*Cover drawing:*
Thallavajhula Shivaji

*Cover & Book Design:*
Brahmam Bhavana Grafix,
Hyderabad @98482 54745

*Printed at:*
Karshak Art Printers,
Hyderabad.

*For Copies:*
All Leading Book Stores
&
Srinija Prachuranalu
6-60/1, Ravindra Nagar,
Old Dairy farm,
Visakhapatnam - 530040
Andhrapradesh
88971 47067
chsr005@gmail.com

*e-book:*
www.kinige.com

₹ 150/-

'ఇస్పేటులు..

తురఫు చెప్పిన..

శెష్పాలకు లోనుగాను..

అంబుజనాభా..'

ఇది పాట కాదు. పాటకి ప్రాణంగా నిలిచే పల్లవి అంతకంటే కాదు. కానీ, కొంతసేపాయి దీన్నే పట్టుకుని అబ్బరాజు వెంకటరాజు దేవుళ్లాడుతున్నాడు. కూనిరాగంలా కాకుండా సంప్రదాయ కీర్తన మాదిరిగా గర్వాతిశయంతో ఒకటికి పదిమార్లు గానం చేస్తున్నాడు.

"పాట మార్చవోయ్. పాట మార్చు. వినలేక ఛస్తున్నాం. ముక్క కొట్టు." వెంకటరాజును అదిలించినట్టుగా అసహనంగా కసిరాడు దిగువరసలో పేకముక్కలు సర్దుకుంటున్న చేంబోలు వరహాలుబాబు.

"వాడంతేనోయ్. గీరగాడు. చచ్చుపుచ్చుగీతాలవాడు. గబగబా ఆడటం తెలియనివాడు." ముక్తాయించాడు కావుడు అనబడే వేదుల కామేశ్వరరావు వెటకారంగా.

"సరి సరి. రెండు పేకలు కలిపినా వెల్లకట్టల్లాంటి ముక్కలే పడ్డాయోయ్. అన్నీ చెంబులే. ముఖ్యంగా ముగ్గురు, కుక్క సంగతి సరేసరి. కనస్త్రాల ఖూనీ ముండలూ వచ్చిచచ్చాయి. చూసుకోవద్దా. అడ్డసుడిగా ఆడితే పేక మహాతల్లికి కోపం వచ్చేను!" పెంకునేత బాపతుగా చేతిలో పేక సర్దుకుంటూ, పడిన పదమూడు ముక్కలే అష్టైశ్వరాలనుకుంటూ మాట్లాడాడు వెంకటరాజు. వీళ్లతో పాటు ఆటకు కూర్చున్న ఎల్లాపంతుల రాముడు, సరిపల్లి చిట్టిబాబు, తనికెళ్ల ప్రకాశం మటుకు ఇదంతా

పట్టనట్టుగా ముక్కల్లో నిమగ్నమైపోయారు. జోకర్లు ఎన్ని జమయ్యాయో.. కలర్లు ఎన్ని కలిసొచ్చాయో.. ట్రిప్లెట్లు ఎన్ని పారొచ్చాయో.. ఆత్రంగా వెతుక్కుంటున్నారు.

త్రిలింగదేశంలోని అన్ని పల్లెటూళ్లలాగానే విశాపట్నం జిల్లా చోడవరం తాలూకా చుక్కపల్లి అగ్రహారంలోనూ ఉదయాన్నే సూరీడు పొడుచుకొస్తాడు. తత్ఫలితంగా తొలుత జానెడు, ఆనక మూరెడు, అనంతరం బారెడు లెక్కన పొద్దెక్కుతుంది. అయితే, ఏఊరి జనం ఎలా తగలడతారో ఏవోగానీ ఈ అగ్రహారంలోని పెచ్చుమంది మగమహారాజులకు ఇలాంటి పట్టింపు ఉండనే ఉండదు. ఊరిమొగన మొనగాడిలో నిలిచే సూరికుచ్చి లక్ష్మణబుగత మిద్దె ఇంటి వీధి అరుగుకు అస్సలుండదు. ఈ అరుగును ఆవుపేడతో అలికించుకునే మామూలు అరుగులా తీసిపారేయలేం. చుక్కల ముగ్గులెట్టించుకునే సాధారణ అరుగులా కొట్టిపడేయలేం. ఇది మహెూత్తరమైన అరుగు. మహెూన్నతమైన అరుగు. పేక క్రీడకు పెన్నిధి. కంపీకి నిలయం. రన్‌మోరుకు రంగస్థలం. స్కోరుకు సొగసుకత్తె. సీక్వెన్స్‌కు సిరులపంట. జానాపట్లకు జాతీయవేదిక. నికరంగా మాట్లాడాలంటే అగ్రహారీకులందరి పేకాట్లకీ స్థితమతి.

లక్ష్మణబుగత అనబడే సూరికుచ్చి లక్ష్మణశాస్త్రి భాషాప్రవీణ పూర్తిచేసిన పరమపురుషుడు. చుక్కపల్లికి సమీపాన ఉండే దామునాపల్లి గ్రామపాఠశాలలో ఆంధ్రభాషాపండితునిగా వెలుగుతున్నవాడు. 'ఈ మాస్టారుగారు పాఠం ఎప్పుడు పలుకుతారా?.. ఆలకించి మరెప్పుడు అసువులు విడుద్దామా!..' అనే కొండంత ఆశతో బడిపిల్లలు సతనిత్యమూ ఎదురుచూస్తుంటారు. అంతటి నికృష్టమైన పనికి తానెప్పుడూ దిగజారనన్నట్టుగా తరచూ పాఠశాలకు పంగనామాలు పెడుతుంటాడు లక్ష్మణశాస్త్రి.

ఇలా బడికి వెళ్లని ఈ పంతులుబాబు పోనీ అని పొలానికయినా వెళతాడా! తప్పు తప్పు. వ్యవసాయం భాగానికిచ్చాక రైతుదే కదూ బాధ్యత. అందుకనే మట్టిమొహం చూడడు. మట్టివాసన పీల్చడు.

అటు కొలువుకు అందక, ఇటు మడిచెక్కకు పొందక మరి ఈయనగారు ఏం చేస్తున్నట్టు? ఇంకేం చేస్తున్నట్టు! ఆసులతోనూ, రాజులతోనూ, జాకీలతోనూ కొండొకచో రాణీలనబడే ఖూనీలతోనూ తనువంతా శ్రుతి చేసుకుంటూ పేకాటను ఔదలదాల్చినట్టు. ప్లేయింగ్‌కార్డ్స్ పాయింట్లనే పావన వేదపనసలుగా పఠిస్తున్నట్టు.

ఈ వ్యవహారమంతా ఆయన భార్య సుగుణవల్లికి ఒకప్పుడు మాచెడ్డ కోపంగా ఉండేది. శుభ్రమైన ఉద్యోగాన్ని గాలికొదిలేసి, పెంటచ్చిగాళ్లందరితోనూ ఈ ముక్కలాటలు ఏమిటని ఆమె పెళ్లయిన తొలినాళ్లలో భర్తతో రంధికి దిగేది. పైగా ఊరు మొదట్లో ఉండే ఇంటి అరుగుమీద బటాచోరు ఆటలాడితే అగ్రహారమంతటికీ శనిపడుతుందని పేచీకి సమకట్టేది.

పెనిమిటిని గౌరవించడమే పెళ్లాం విధి.. భర్తను ప్రేమించలేని భార్య దేశాన్ని

ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రేమించలేదు.. పద్ధతిలో తరచూ మందలించే తల్లిదండ్రుల మాటల ప్రభావం ఆమెను ఆ పేచీలో నెగ్గనివ్వలేదు. ఆ రంధిలో ఆదుకోలేదు. దీనికితోడు ఎక్కువతక్కువగా మాట్లాడితే మొగుడు తిట్టే ముండారండా తిట్లు ఎలానూ ఉన్నాయి. కొట్టిపోసే తోలుచెప్పు దెబ్బలకూ కరవు లేదు. ఇవన్నీ ఆమెను చైతన్యవంతం చేశాయి. మనసును వికసింపజేశాయి. వెనుకంజ వేసేలా చేశాయి. ఇందువల్లే అగ్రహారంలో భర్తను పెనుదైవంగా భావించి పూజించే అనేకమంది పతివ్రతల జాబితాలో ఆమె కూడా చేరగలిగింది. పేకాటగాళ్లకు అనుదినమూ కాఫీలు టీలు అందిస్తూ కొయ్యచేగోడీలు కారప్పూసలు చెల్లిస్తూ నిరాశగా కాలం గడుపుతోంది. చనిపోయాక నాకలోకంలో సతీ అనసూయ పక్కనో, సతీ సుమతి పక్కనో, తక్కువలో తక్కువగా సతీ సక్కుభాయి పక్కనో దొరికే బంగారు సింహాసనం కోసం ఆశగా ఎదురు చూస్తోంది.

ఇదంతా ఇలా ఉండనిస్తే, ఈ రోజు మాత్రం ఆటలో లక్ష్మణశాస్త్రి కూర్చోలేదు. స్కూల్స్ఇన్స్పెక్టరు వస్తున్నాడన్న వర్తమానం చెవి చేరడంతో అతగాడు దామునాపల్లికి దారితీయక తప్పలేదు. ఒకరోజు ఆటకు నాగా వచ్చిందన్న బాధలోనే సైకిల్మీద పొద్దున్నే బడికి పోనేపోయాడు.

"లక్ష్మణుడుంటే ఆట భలే రంజుగా ఉండునొరేయ్. వాడి పదాలు, పద్యాలు, కవిత్వాలు వినేవాళ్లంరోయ్. నాకు డీల్ షో పడినందుకు వాడు భలేగా గింజుకునేవాడేను." కొన్ని గంటల వ్యవధిలోనే సుగుణమ్మ మూడోసారి పంపించిన కాఫీని చప్పరిస్తూ కులుకుతూ అన్నాడు వేదుల కావుడు.

"వాడు దేన్నయినా సహించగలడు గానీ, ఎవడికయినా చేతిలో ఆట అయిపోతే చూడలేడు సుమా. గాత్రం పాడెస్తాడు." అంటూ మడగాళ్ల పంచెమడతల్లోంచి కొన్ని కాసులు పైకితీసి విసిరేసినట్టుగా చాప మీద కావుడు వైపు పడేశాడు వెంకటరాజు. ఆట డ్రాప్ చేసినందువల్ల కొంచెంతోనే పోయిందన్న ఆనందం.. పెద్ద కంచుగళాసులో వేడివేడి ఉచిత కాఫీని ఎర్రటి నాగుల గావంచాతో పట్టుకుని తాగుతున్న సంతోషం.. జమిలిగా అల్లుకున్న విషయం అతడి మోహం చూస్తే ఎవరయినా ఇట్టే చెప్పగలరు.

"కానీండి కానీండి. భోజనానికి వేళవుతోంది. అపరాహ్ణం దాటాక ముద్దమింగితే తద్దినం బోయినంతో సమానం." ముక్కలు పంచాలంటూ పక్కనే ఉన్న చిట్టిగాణ్ణి తొందరపెట్టాడు రాముడు.

సరిగ్గా అదే సమయానికి ఆ వీధిలోకి ప్రవేశించారు భమిడిపాటి వేదభాస్కరం, పేరి భగవంతం. వీళ్లిద్దరూ వైజాగ్ కాల్టెక్స్ ఉద్యోగులు. పొద్దున్ననగా విశాపట్నం నుంచి బస్సులో బయలుదేరి చోడవరం వచ్చిపడ్డారు. ఎముకలు సున్నమైనట్టయింది. ఎండ కూడా ఆ రోజు జాస్తీగానే ఉంది. ఉడకలాడించేస్తోంది.

చోడవరంలో దిగి, అప్పాలు హోటల్లో ఇడ్లీలు తిని, చుక్కపల్లి గోర్జీలో పడేసరికి వీళ్లకి దేవుడు కనిపించాడు. చుక్కపల్లికి బస్సులుండవు. జట్కాలుంటాయి గానీ ఒకటో అరో. అవి ఎప్పుడు వస్తాయో వాటికే తెలియదు. సొంత ఎడ్లబళ్లున్న వారు మాత్రం తమ ప్రయాణాల ప్రకారం బెత్తాయించుకుంటారు. ఇవేమీ లేనివాళ్లకి రెండు కాళ్ల శకటమే శరణ్యం.

ఇసక గోర్జిలో నడవడం ఒక కళ. అందరికీ చేతవ్వదు. అలవాటుండాలి. కొత్తవారికి పులుపు తీరిపోతుంది. పులుసు కారిపోతుంది. ఇసకలో అడుగు పెడితే ముందరికాలు లోపలికి పోతుంది. మరో అడుగు వేయాలంటే వెనక కాలు ఇసకలోంచి లాక్కోవాలి. అలా లాక్కునేసరికి మన పాదమే మనకు బరువన్నట్టవుతుంది. తాతలు దిగొచ్చేస్తారు. దీనికి తోడు గోర్జి పక్కనుండే డొంకల్లోంచి పురుగూ పుట్రా వచ్చిపడుతుందేమోనన్న భయం ఎలాగూ ఉంటుంది. మరోవైపు నడకదారి పొడవునా కంపలు, తుమ్మలు, తాళ్లు, ఈతలు తెగబలిసి గాలివేస్తే చావురాగం పాడినట్టే గీ.. గీ.. పెడుతుంటాయి. కొత్తవారికి భీతావహం కలిగిస్తుంటాయి. ఒకటీ రెండూ కాదు గోర్జిలో నాలుగుమైళ్లు పూర్తిగా నడిచి చొక్కాలూ పంట్లాలూ తడిసిముద్దవగా చుక్కపల్లి చేరగలిగారు మిత్రులిద్దరూను.

చోడవరం దాటి అన్నవరం వచ్చేసరికే వారికి పై ప్రాణాలు పైనపోయాయి. ఖండేపల్లి చేరేసరికి కళ్లు బైర్లు కమ్మాయి.

"ఇలాంటి ఊరికి పిల్లనిస్తామా భగవా." రుమాలుతో ముఖం తుడుచుకుంటూ బాధగా అడిగాడు భాస్కరం.

"చెల్లాయి ఇక్కడేం ఉండదులే. మొగుడుతో కదా ఉండేది." ధైర్యంగా పలికాడు భగవంతం. ఇద్దరూ ఇలా మాట్లాడుకుని మెల్లగా ముందుకు కదులుతున్నారు. సరిగ్గా అప్పుడే సూరికుచ్చారి అరుగుమీద ఆట పారేసి రికామీగా కూర్చున్న కావుడు వీళ్లను చూశాడు. చూసినవెంటనే,

"ఒరేయ్ వెంకడూ, వరహా, చిట్టీ, రావుడు అలా చూడండ్రా. ఒక పొడుగు వెధవా, ఒక పొట్టి వెధవా వేంచేస్తున్నార్రా." ఆసక్తిగా, హుషారుగా గొంతు పెట్టాడు.

ఆ మాటల్ని వరహాలుబాబు తప్ప ఎవ్వరూ పట్టించుకోలేదు. వాడూ పట్టించుకోకపోను. కానీ, వాడి చేతిన అన్నీ పొడిముక్కలే పడ్డాయి. మరంచేతనే పట్టించుకున్నాడు. కావుడు కళ్లతో చూపించిన వీధి మొదలువైపు చూస్తూ,

"నిజమేఁన్రోయ్. కొత్త వెధవలే విచ్చేస్తున్నారు. మన ఊళ్లో ఈ పాజీలకి ఏం పనో" కిచకిచలాడాడు.

ఎప్పుడైతే వరహాలుబాబు గట్టిగానే ఈ మాట అన్నాడో మిగిలినవారంతా ముక్కలు జాగ్రత్తగా మూసి పట్టుకుని చిత్రంగా ఆ దృశ్యం చూసేందుకు తలపడ్డారు. అలా

చూసిన వారిలో తొలీతా తేరుకున్నవాడు చిట్టిగాడు.

"ఒరేయ్! ఫేంట్లూ గేంట్లూ తొడిగాగ్రోయ్. చేతావాతాకాని మన వాజమ్మల్లాగానే ఉన్నారు. అయితే ఒకటి. ఆఫీసర్ అమ్మమొగుళ్లా కానొస్తున్నారు. మన వాస వైపే దిగబడుతున్నారు. రానీ రానీ." ఏదో తెలియని కసితో, చేపను దరికి రానిచ్చి గుటుక్కుమనిపిద్దామనుకునే నీళ్లలోని కొంగలా పలికాడు.

"పంట్లాలు మనకేం కొత్తా బావా! మనకీ ఉన్నాయ్. కాకపోతే ఊళ్లో ఉండబట్టి గావంచాలతో చతికిలబడుతున్నాం. వాళ్లు ఆఫీసర్ అమ్మమొగుళ్లయితే, మనం అగ్రహారానికే అక్క మొగుళ్లం. రాయికి రంకు మొగుళ్లం." పెద్దనోరు పెట్టి లగ్గలకెత్తాడు ఎల్లాపంతుల రావుడు.

"వాళ్లకి వినిపిస్తుందిరా. మెల్లగా.మెల్లగా." రావుణ్ణి వారించబోయారెవరో.

"వినిపిస్తే వినిపించనీ. వాళ్లని లంజాలమ్డీ అని మనవేం తిట్టలేదు కదా." నిష్పూచీగా మాటలు జార్చాడు రావుడు.

అప్పటికే వీధిలోకి కొంత దూరం నడిచి వచ్చేసినందువల్ల భాస్కరానికీ, భగవంతానికీ ఈ సంభాషణలన్నీ స్పష్టంగా వినిపించకపోయినా కర్ణాకర్ణిగా సోకాయి. భగవంతానికి మటుకు అరుగుమీది చెవలాయిలు తమనే వెధవా.. గిధవా.. అని తిడుతున్నట్టుగా బోధపడిపోయింది.

భాస్కరంతో పోలిస్తే భగవంతం సిసలైన భాస్వరమే. చురుకైనవాడు. ఆఫీసులో కూడా భాస్కరుడు ఏవైనా చిక్కుల్లో పడితే విప్పదీసేది ఈ భగవంతుడే. వీరి మధ్య చెలిమి ఎప్పుడు కుదిరిందో ఆ ముహూర్తబలం గొప్పది. స్నేహబంధం నేటికీ చిక్కగా కొనసాగుతూనే ఉంది. ఇద్దరిదీ ఒకటే ఈడు కావడంతో నానాటికీ అది మారాకులున్నూ వేస్తోంది. అరుగుమీది ఆసాములను గురించి భాస్కరానికి ఏదో చెప్పబోయాడు భగవంతం.

"ఆ పేకాటవాళ్లని మనవాళ్ల వివరాలు అడుగుదామా?" ముంజేయి ఎత్తి తను వేసుకున్న ఫుల్‌హ్యాండ్స్ కమీజుతో ముఖానికి పట్టిన చెమటలు తుడుచుకుంటూ భాస్కరం అన్నాడు. అందుకు సరేనన్నాడు భగవంతం.

ఇరువురూ మెల్లగా నడుచుకుంటూనే పేకాట అరుగు దగ్గరకి చేరారు. ఆ వీధిరోడ్డూ మట్టిదే అయినా, కాస్త గట్టిగా ఉండటంతో గోర్జిలో బలంగా వేయవలసిన పాదాలను మెల్లగా కదిలించే ఆస్కారం కలిగింది భాస్కరానికి. కాబట్టే ఆయాసం తగ్గింది. జాపోసుకోవడమూ తక్కువైంది.

వాళ్లూ అలా అరుగు దగ్గరకి రాగానే ఏమైందో ఏమో అప్పటివరకూ గలగలా మాట్లాడిన పేకాటరాయుళ్లంతా బిగుసుకుపోయినట్టుగా కూర్చుండిపోయారు. అంతదాకా

ఇష్టారాజ్యంగా పేలాపన పేలిన ప్లేయింగ్‌కార్డ్ ప్లేయర్లు, వీళ్లవైపు కన్నెత్తి చూడకుండా గోరోజనం ప్రదర్శించడం మొదలుపెట్టారు. భగవంతానికి ఇదంతా కొంచెం కోపం తెప్పించింది. అయినా తొందరపడలేదు. పాలకోసం రాళ్లు మొయ్యమన్నారు.. అనే సిద్ధాంతాన్ని అమలు చేస్తున్నట్టుగా నిశ్శబ్దాన్ని పాటించాడు.

పేకాటబాబుల్ని ఎలా కదపాలో భాస్కరానికి బోధపడలేదు. అన్నవరం సత్యనారాయణస్వామి వ్రతానికి కూర్చున్నప్పుడు కూడా అంత నిష్ఠ పాటించలేని చందంగా చతుర్ముఖపారాయణం చేస్తున్న అగ్రహారీకులను చూసి కొంచెం భయపడ్డాడు కూడాను. ఇంతలోనే, పారేయవలసిన పేకముక్కలను సైతం ప్రియంగా పట్టుకుని తేరిపార చూస్తున్నట్టుగా అభినయిస్తూనే రావుడు అందుకున్నాడు. అనుమతి లేకుండా రాజుగారి సమక్షానికి చేరవచ్చిన పల్లెటూరిబైతుజోడీని ఉద్దేశించి సేనాధిపతి మాట్లాడినట్టుగా ముఖం పక్కకు తిప్పకుండానే,

"ఎవరోయ్? ఇలా దయచేశారు. ఏవిటి కథ! మరేవిటి వ్యథ. ఆలస్యం దేనికి. ప్రవర చెప్పుకోండి." విస్సాటంగానూ, వెటకారంగానూ పలికాడు. భగవంతానికి ఒక్కసారిగా చిర్రెత్తుకొచ్చినట్టయింది.

'ఏవిటి వీడి పోగాలం. ఏవిటి వీడి గొప్ప. గుడ్డుగాడు వీడేనేంటి బ్రహ్మిగాడు. మేం కాదా? సాటి మనిషిని ఇంత నేలబారుగా పలకరించడం ఏంటట. సలసలకాగుతున్న నూనెలో ఇలాంటివాళ్లని వేయించి పారేయవద్దా..' అన్నట్టుగా మనసులోనే కుసిల్లాడు. భాస్కరంవైపు అదోలా చూశాడు. విషయం అర్థం చేసుకున్నట్టుగా భాస్కరుడు ముఖం పెట్టి 'కార్యార్థులం..' అనే విషయాన్ని కళ్లతోనే భగవంతానికి నచ్చచెప్పి నోరు విప్పాడు.

"అయ్యా! మీ అందరికీ నమస్కారం. మేం విశాఖపట్నం నుంచీ వచ్చాం. మా ఇంటిపేరు భమిడిపాటి. నా పేరు." ఇంకా ఎంతో చెప్పాలని అనుకుంటుండగానే రావుడు కలుగజేసుకుని,

"వెలనాటివాళ్లన్నమాట. అదీ అలా చెప్పండి. ఆ జడ్డితనం, ఆ జంకతనం కొట్టొచ్చినట్టుగా కనబడుతున్నాయిలెండి. ఇదిగో ఈ తనికెళ్లవాడూ మీ వెలనాటి వెర్రికుట్టిగాడే." వికవికలాడిపోయాడు.

ఆ మాటలకి భాస్కరం గతుక్కుమన్నాడు. భగవంతానికయితే తారకం ఎక్కిపోయింది. అప్పటివరకూ మారు మాట్లాడకుండా పేకాటను పవిత్రయోగంగా భావించి ఆడుకుంటున్న ప్రకాశాన్ని వెర్రికుట్టె పదం బాధించినట్టుంది. జంక, జడ్డి పదబంధాలు కూడా వినడంతో దెబ్బతిన్నట్టుగా అయిపోయాడు.

"నోర్ముయ్యరా వేగినాటి ముండాకొడకా! పోతరంగా ఉందేం నీకు. మా వెలనాట్లను ఎత్తిపెట్టేవాడివిరా కుంకాయీ. నువ్వూ నీ బతుకూను." హుంకరించినట్టుగా అనేశాడు.

"అబ్బా! చూశారర్రా. వీళ్ల వెలనాట్లను చూడగానే వీడికి ఎంత కట్టు వచ్చి పడిపోయిందో. సరేలేరా ప్రకాశం, మీరు గుంటూరు సీమలోని చందవోలు వెలనాడు నుంచీ తగలడ్డారు. మేం వేంగీక్షేత్రం నుంచీ వేగినాట్లుగా వెళిపోయిచ్చేం. కృష్ణాతీరం వైపునుంచి లగెత్తుకొచ్చారు నియోగులు. అక్కడెక్కడో పటంచెరువు కాసలనాడు కొనలనుంచీ పారొచ్చారు కాసంనాట్లు. సముద్రాలు దాటుకుంటూ వచ్చిపడ్డారు ద్రావిళ్లు. అందరం ఇక్కడికి వలసపక్షులమేలే." అనునయంగా ఈ మాటలను రాముడు పలకడంతో ప్రకాశం కాసింత మెత్తబడినట్టయ్యాడు. అయినప్పటికీ,

"అలా మాట్లాడు. అయినా పెద్దమనుషులు చెంతకు చేరినప్పుడు కుశలమడగాలి. కులాసాగా మాట్లాడాలి. ఆ ఇంగితం కూడా నీకు లేదొరేయ్." పెద్ద నోరు పెట్టి అరిచాడు.

దెబ్బకి భాస్కరం బెంబేలెత్తిపోయాడు. 'ఇదేం అగ్రహారంరా బాబూ. వీళ్లు బ్రహ్మరాక్షసుల్లా ఉన్నారే..' అనుకుంటూ కిమ్మనలేకపోయాడు. ఈ కథంతా మింగుడు పడక భగవంతం మెదడు కూడా దిమ్మెక్కినట్టయింది.

ఈలోగా అందరూ ఆటపారేసినందువల్ల మరో ఆటకు ముక్కలు కలుపుతున్న కావుడు ప్రారంభించాడు.

"ఏ పని మీద వచ్చారో, ఎవరు కావాలో గబగబా చెప్పండి. మాకు బోలెడంత పనుంది." అన్నాడు విసుగ్గా. ఇది వినగానే భగవంతానికి కావుణ్ణి పేడలో ముంచిన చెప్పుతో కొట్టాలని అనిపించింది. కనీసపక్షంగా బండబూతులయినా తిట్టాలనిపించింది.

'పేకముక్కలు ఆడుకునే చెత్తరకాయల్లారా! మీకున్న మహాపని ఇదే కదరా. మీరేం యాగాలు చెయ్యాలా, శాంతులు జరిపించాలా బడుద్ధాయిల్లారా..' అనయినా తక్కువలో తక్కువగా అనాలనిపించింది. కానీ, నోరు మెదపలేని స్థితి అతనిది. స్నేహితుని కోసం ఉగ్గబట్టుకున్నాడు.

వీళ్లతో ఎందుకొచ్చిన గొడవలే అన్నట్టుగా చప్పున భాస్కరం సంభాషణ కొనసాగిస్తూ,

"నా పేరు వేదభాస్కరం అండీ. ఈ ఊళ్లో ఉంటున్న నిష్టల భానుమూర్తిబుగతగారిని కలవడానికి వచ్చాం. వాళ్ల ఇల్లు ఎటువైపో కాస్త చెబుతారా?" వీలయినంత వినయంగా వందనంగా అడిగాడు.

"అదీ. అలా చెప్పండి. మరికనేం." అంటూనే,

"ఒరేయ్. ఇంకెవరు మన భానుగాణ్ణి కలుస్తారర్రా. వాడూ ఒక బుగతే కదూ.." అన్నాడు వెంకటరాజు వేళాకోళంగా.

'దీనికింత వేళాకోళం ఎందుకురా భ్రష్టాయీ..' అని మనసులోనే తిట్టుకుంటూ

కొంచెం క్రూరంగా వెంకటరాజు కళ్లల్లోకి చూశాడు భగవంతం. మరుక్షణంలోనే ఈ విషయాన్ని గ్రహించేసినట్టుగా అయిపోయాడు వెంకటరాజు. భగవంతం వైపు చూస్తూ,

"ఈ ఊళ్లో ప్రతీ డ్రాపి వెధవా బుగతే. ప్రతీ వోపి వెధవా బుగతే. అసలు బుగత కానివాడెవడు. భూములు పోయినా బుగతలనే బిరుదులు మాత్రం పోలేదు. చచ్చుముండా కొడుకులు. అదో వింత తంతు లెండి. ఇంతకీ విషయమేమిటో చెప్పకుండా మమ్మల్ని సమాచారం అడగడం ధర్మమా? దబాయింపు కాకపోతేను." తెలివిగా చిరచిరలాడాడు.

ఈ బాగోతానికి ఇక్కడితో తెరదించడం మంచిదన్నట్టుగా భావించిన వేదభాస్కరం రంగంలోకి దిగాడు.

"భానుమూర్తిగారి అబ్బాయి కృష్ణమూర్తిగారికి నా ఒక్కగానొక్క చెల్లెలు మహాలక్ష్మిని ఇచ్చి పెళ్లి చేయాలనుకుంటున్నానండీ. ఆ సంబంధం పనిమీదనే వచ్చాం." చెప్పవలసిన సంగతిని చకచకా ఏకరవు పెట్టేశాడు.

ఈ భోగట్టా విన్న వెనువెంటనే మరింతగా అప్రమత్తమై పోయినట్టుగా అయిపోయాడు వేదుల కావుడు.

"అలాగా. మరి చెప్పరేం. ఒరేయ్ మన భానుగాడి కొడుకు కిష్టప్పకి వీళ్లు పిల్లనిద్దావని వచ్చారట్రా. అదీవిషయం." పెనుగళంతో కొత్త సంగతేదో తనే కనిపెట్టినట్టుగా చెప్పాడు. ప్లవనసూత్రాన్ని కనుక్కున్నప్పుడు ఆర్కిమెడిస్ కూడా అంత ఆశ్చర్యపడి ఉండడు. అంతకు మించిన ఆశ్చర్యంతో చెప్పినట్టు చెప్పాడు. చెప్పడమే కాదు. అంతటితో ఊరుకోకుండా,

"నిష్టల వారి కిష్టిగాడు..

హిస్టరీలో ఫస్టు మార్కు తెచ్చుకుని..

కష్టపడి, కష్టపడి..

బస్టాండ్లో ముష్టెత్తుకుంటున్నాడు.."

అనే మాటల్ని రాగంకట్టి మరీ పాడినట్టుగా గొంతెత్తి అదోలా ఆలపిస్తూ పేకముక్కలనే చర్మవాద్యాలుగా చేసుకుని వేళ్లతో వాటిమీద ఏదో వాయించాడు.

ఆ పాటకీ, ఆ వాయింపుకీ అటు భాస్కరం, ఇటు భగవంతం కూడా గాభరా ఎత్తిపోయారు. ఇదేంటిది? ముష్టిగిష్టీ అంటున్నాడంటూ వ్యాకులపడ్డారు. వీళ్ల మల్లగుల్లాలు చూసి ప్రకాశం జాలిపడ్డాడు.

"మీరేం వెనకదియ్యకండి. మా కావుడు మావయ్యకి అంతా వేళాకోళమే. మా అగ్రహారంవారి ఇంటి పేర్ల మీద కవిత్వం అల్లి ఇలాంటి పాటలు పాడటం ఆయనగారికి సరదానున్నూ. దురదానున్నూ." అసలు భోగట్టా వెల్లడించాడు. ఈ వెల్లడింపుతో భాస్కరం

స్థిమితపడ్డాడు.

"అదే కదా. ఆ కుర్రాడు ఢిల్లీలో పెద్ద ఉద్యోగం చేస్తున్నట్టు తెలుసుకునే వచ్చాం." అనేశాడు మెల్లగా.

"ఆ..ఆ.. చేస్తున్నాడు లెండి. వాళ్ల నాన్న వద్దంటే వినకుండా ఖరగ్‌పూర్ వెళ్లి అదేదో ఇంజనీరింగ్ చదివి అఘోరించాడు. హాయిగా అగ్రహారంలో ఉండడానికి వాడికి పోయీకాలం. కడుపుచేతబట్టుకుని అక్కడెక్కడికో పోయాడు.'' వెంకటరాజు ఉస్సురన్నట్టుగా అన్నాడు. దీంతో భగవంతం రాజుకుపోయాడు.

'ఇదో అగ్రహారం. మీరో అగ్రహారీకులు. ఫకీరు వెధవల్లాలా! వాడూ ఇక్కడే ఉంటే, మీలాగే నీరుకావి గావంచాలు కడుతూ, తాటిచాపలను ముడ్డితో అరగ్గొడుతూ, పేకాట్లాడుకుంటూ బతుకు పండించుకునేవాడు. అదృష్టవంతుడు కాబట్టే పెద్ద చదువు చదివాడు. అసలు మీలాంటి వాళ్లని తోలుకొరడాలతో కొట్టి కారం రాసినా తప్పులేదురా జెష్ట ముండాకొడకల్లాలా..' మనసులోనే తెగ తిట్టుకున్నాడు ఇదంతా పైకే చెప్పాలన్నంత రోషం కూడా అతనిలో అంకురించింది. ఇంతలోనే,

"కృష్ణమూర్తిగారు చదువుకున్నది ఐఐటీలోనండీ. దేశంలోనే సాంకేతిక విద్యకు పెద్ద చదువుల సంస్థ." ఈ లెక్కన భాస్కరం ఏదో మొదలెట్టడంతో భగవంతం ఆలోచనలకు గండిపడింది.

"సరేలెండి. ఆ ఊసు మాకెందుకు. వాడెక్కడ విద్యాబుద్ధులు వెలిగిస్తే మాకేంటి. వాడెక్కడ నట్లూ బోల్టులూ బిగిస్తే మాకేంటి. ఈక ముక్క బరాబర్. అదలా ఉండనివ్వండి. ఇంతకీ ఆ నిష్టల కృష్ణుడికి మీరెంత కట్నం ఇద్దామనుకుంటున్నారో అది శెలవివ్వండి." కావుడు మాట్లాడిన ఈ మాటలకి భగవంతం మరిక నిగ్రహించుకోలేకపోయాడు.

"ఏంటండీ మీ మాటలు. ఇదే అగ్రహారం మర్యాదండీ. సంబంధం కోసం వచ్చాం. కాస్తంతయినా స్థిమితంగా మమ్మల్ని ఉండనివ్వకపోతే ఎలాగండీ. వచ్చిన దగ్గర్నించీ ఈ ఇంటర్వ్యూలేంటండీ. ఆ నిష్టల వారిల్లు ఎక్కడో చెబితే పోతుంది కదా." పేరి భగవంతం పెటపెటలాడినట్టే అన్నాడు. చిరుకోపంలో ఏం చేయాలో తెలియక అరుగు మీదికి వేళ్లాడుతున్న పంచలోనుంచి ఒక ఎండిన తాటాకు ముక్కలాగాడు. చేన్నాళ్లుగా ఆ కప్పుకు మారు నేత లేకపోవడం మూలాన తాటాకుతో పాటు కొంత చెదమట్టి కూడా భగవంతం చేతిలోకి వచ్చింది. అతగాడు దాన్ని కింద దులిపాడు.

"హాయ్. చూడండోయ్. తాటాకు లాగిన చోటనే తాంబూలాలు ఇద్దామని అనుకుంటున్నాడోయ్ ఈ అబ్బాయి. మన మాటలకి ఈయనగారు కోపం తెచ్చుకున్నట్టుగా ఉంది. ఇంత ప్రథమాగ్రహాలవాళ్లు పాణిగ్రహణం ఎలా చేయిస్తారో. ఇంతటి సత్పరుషులు పెళ్లివారిని ఎవ్విధమున సందరింతురో. మరేలాగున సమాదరింతురో. ఇంతకీ ఈ కోపధారి ఒంటి పేరేమి. ఇంటి పేరేమి. వివరములు

పూరాగా తెలియజేయగలరు." పేక పంచడం పూర్తికావడంతో జోకరు కోసి, అరుగు రాటకు చేరబడి, పెటేపకాయలా గ్రాంథికంగా పేలాడు సరిపల్లి చిట్టిబాబు. ఎవణ్ణయినా వెటకారం చేయాల్సి వచ్చినప్పుడు గ్రాంథికంగా మాట్లాడటం చిట్టిగాడికి మహాసరదా.

చిట్టిబాబు మాటలతో వ్యవహారం మొదలుకే చెడుతుందన్న భయమేదో భాస్కరంలో పొంగిపొరలింది. వెంటనే భగవంతం భుజం మీద చెయ్యివేసి కొద్దిగా తగ్గమన్నట్టుగా ఒక నొక్కు నొక్కాడు. తను మాట్లాడతానన్నట్టుగానూ ఆ నొక్కుడుకు అర్థం ఉందని తలచి భగవంతం గప్‌చుప్ అయిపోయాడు.

"మావాడికి కోపం అదీ ఉండదండీ. కాకపోతే కొద్దిగా స్పష్టంగా మాట్లాడతాడంతేను. దాన్ని మీవంటి పెద్దలు మరోలా అర్థం చేసుకోకూడదు. ఇతగాడు పేరి వారి కుర్రాడు. పేరు భగవంతం." ఎప్పుడయితే భగవంతం ఇంటిపేరు పేరి అని భాస్కరం చెప్పాడో వేదుల కావుడికి చెవుల్లో అమృతం పోసినట్టయింది.

"అదీ సంగతి. అలా చెప్పండి. ఈ అబ్బాయి మా ద్రావిడి. అస్మదీయుడు. అందుకే ఆ స్వచ్ఛత. ఏ మాటకామాట చెప్పాలండి. మా ద్రావిళ్లలో, ముఖ్యంగా మా పెద్ద ద్రావిళ్లలో వేదుల వారు కానీండి, పేరి వారు కానీండి, కొడుకుల వారు కానీండి సూటిదనానికి పెట్టింది పేరండీ. మరేం ఫరవాలేదు. ఆ మాత్రం స్పష్టత మనిషన్నవాడికి ఉండవలసిందేను." దిలాసాగా పలికాడు కావుడు.

"ఓహో! ద్రావిళ్లు అనగానే కావుడుకి ముఖం విప్పారిందే. దాన్నలా పక్కనబెట్టి కట్నం ఎంతిస్తారో అది చెప్పమనవోయ్ ముందుగూండాను." వరహాలుబాబు కావుడివైపు తిరిగి ఇకిలించాడు. ఇలాంటి వాళ్లతో మనకెందుకు లెమ్మన్నట్టుగా భగవంతం నోరువిప్పాడు.

"మా భాస్కరానికి తండ్రి లేడండీ. ఒక్కర్తే చెల్లెలు. జనకుడు ఇచ్చిన ఈ బాధ్యత చక్కగా పూర్తి చేయాలనుకుంటున్నాడు. చెల్లాయికి మంచి సంబంధం అయితే అదే చాలనుకుంటున్నాడు. కట్నం ఎంతయినా ఫరవాలేదు. ఇవ్వగలడు." ఇంతటితో ఈ ప్రసారం సమాప్తం అని రేడియో పలికినట్టుగా పలికాడు. అయినా ఈ విషయాన్ని వెంకటరాజు వదిలిపెట్టదలుచుకోలేదు.

"అడ్డెడ్డే. అలా గేదెని నీట్లో పెట్టి బేరాలు చెప్పకండి. ఎంతయినా ఇస్తామనడం సరైంది కాదు. ఎంతయినా ఇస్తామంటే దానం పట్టడానికి అగ్రహారంలో ఎవడూ సిద్ధంగా లేడు. అయినా మీ మాటే తప్పు. ఎంతయినా అంటేను, 'దంతావళంబుపై బలవంతుండొక్కండు నిలిచి పైకిం రతనంబెంతటి దవ్వున రివ్వున రువ్వునో..' అని నక్షత్రకుడు కోరినట్టుగా ఇవ్వగలరుటండీ." తన పద్యనాటకాల ప్రతిభ వెలిగక్కాడు.

ఏం సమాధానమివ్వాలో భాస్కరానికి బోధపడలేదు. భగవంతం అయితే నీరుగారిపోయాడు. ఈ స్థితిని పరికించి చూసిన తనికెళ్ల ప్రకాశం, ఇక వీళ్లని ఇక్కట్ల

పాల్జేయకూడదన్న భావనతో,

“ఈ వీధిలోనే తిన్నగా నాలుగు అడుగులు వెయ్యండి. మీకు రథంకొయ్య కనబడుతుంది. అక్కడ కుడికి తిరగండి. గోశాల ఇల్లే నిష్టల వారిది. వెళ్లండి. శుభం.” అనేశాడు.

‘విలాసం తెలిసింది భగవంతుడా..’ అనుకుంటూ మరి ఒక్క క్షణమైనా జాగు చేయకుండా భాస్కరాన్ని కదలదీసి ముందుకు పోయాడు భగవంతం. చిరునామా దొరికినందుకు భాస్కరం కూడా కొంత స్థిమితపడ్డాడు. ఇద్దరూ అలా నడుస్తుండగానే అరుగు మీదనుంచే కావుడు అరుస్తున్నట్టుగా,

“రథం కొయ్య దగ్గర దారి మళ్లండేం. అక్కడ పిడకల కుచ్చె కనిపిస్తుంది. అది గళాసా బోర్లించినట్టుంటుంది. అదే ఆ భానుబుగతగాడి ఇల్లు. కూటికి గతిలేకపోయినా నూటికి ఫరవాలేనట్టుంటాడు. వాడే ఆ అభాజనుడు. సరిగ్గా తిలదానాలుపట్టే బ్రాహ్మడిలా నల్లగా మొస్సేలాగ కనిపిస్తాడు. వెళ్లండి. వెళ్లండి.” గయ్ గయ్ మన్నాడు. అలా అంటున్నప్పుడు అతనిలో అక్కరలేని అసూయ, అకారణ విద్వేషం ఎందుకనో పెద్దఎత్తున ఎగసిపడింది. గాలిలో తెరలు తెరలుగా వస్తున్న ఈ మాటలన్నీ విన్న భాస్కరభగవంతాలు తుళ్లిపడ్డట్టయ్యారు. గబగబా ముందుకు వెళ్లిపోయారు.

అప్పటికీ కావుడి తొడను వెంకటరాజు గిల్లినందువల్ల ఊరుకున్నాడే గానీ లేకపోతే వాడు ఇంకా ఏవేవో కూతలు కూస్తూ ఉండేవాడే.

“అరిచింది చాల్లే. ఇంక ముక్కలు పంచు.” అని ప్రకాశం విదిలించడంతో మళ్లీ కావుడు పేకలోకంలోకి వచ్చిపడ్డాడు.

అలా పడ్డప్పటికీ అతగాడి నేత్రాల్లో ఏదో గయ్యాళితనం, ఇంకేదో ఉలిపిరితనం, మరేదో ఓర్వలేనితనం కలగలిసి ఎర్రజీరలుగా మారి గోచరమయ్యాయి. మళ్లీ అందరూ ఆటలో కలిసిపోదామని భావిస్తున్న తరుణంలోనే ఒక్కసారిగా వెంకటరాజు గగ్గోలుగా పెట్టిన కేక పేకాటబాబుల కచ్చులో కందులు వేసేసింది. వాళ్లను చెట్టోపిట్టగా తరిమి పారేసింది. దిక్కో చుక్కగా చెరిగిపోసేసింది.

మరి వెంకటరాజు వల్లించిన మాట సామాన్యమైనదా? అది ఆ ఊళ్లో పచ్చిబోకుల్లా తిరిగేవాళ్లందరి పాలిటా సిసలైన శాపమే. పోరంబోకుల్లా మెలిగే వాళ్లందరి పాలిటా అసలైన క్లేశమే. ఇంతకీ ఆ మాటేంటంటేను,

“కన్నబుగత వస్తున్నార్రోయ్.. కన్నబుగత వచ్చేస్తున్నార్రోయ్..” అనేదే.

కన్నబుగత పేరు చెబితే సూరికుచ్చి లక్ష్మణబుగతకే కాదు. అగ్రహారంలో అనుశాసన తప్పినవారి గావంచాలన్నీ కన్నీరు పెడతాయి. పంచెలన్నీ మున్నీరు అవుతాయి. ఆ పేరుకు అంత స్థితీ గతీ ఉంది.

ఇంతకీ ఈ కన్నబుగత ఎవరు?.. అంటే గనుక, కొంత చెప్పుకోవాల్సిందే. ఆయన అసలు పేరు జరుగుబిల్లి గున్నేశ్వరరావు. గున్నబుగతగా పిలుచుకుని పిలుచుకుని చివరికి ఆ పిలుపును కన్నబుగతగా ఊరంతా ఆయన విషయమై స్థిరం చేసుకుంది. తొంభైకి పైనే వయస్సు ఉంటుంది. కమ్మిచ్చువు తీసినట్టుంటారు. ఇప్పటికీ వ్యవసాయం చేస్తారు. వేదం వల్లిస్తారు. మంత్రం చదువుతారు. సంధ్య వారుస్తారు. కూర్చుని తినేరకం అస్సలు కాదు. ముఖ్యంగా పేకాటలు, లాటరీ బల్లలు అంటే మెడల మీద తన్నేరకం. చెప్పుకింద నలిపేసే గుణం. క్రమశిక్షణకు మారుపేరు. శ్రమశక్తికి మరో రూపు. ఒకప్పటి మేటి సంప్రదాయాలకి చిహ్నంగా నేటికీ అగ్రహారంలో కన్నబుగతను లెక్కబెట్టుకోవచ్చు.

అందుకే ఆయన మాట వేదవాక్కు. ఆయనను చూస్తే గ్రామ పెద్దలందరూ వచ్చీరాని వేదమయినా పఠిస్తున్నట్టు పెదాలు కదుపుతుంటారు. వీలయినంత బ్రహ్మజ్ఞానంతో విరాజిల్లుతున్నట్టుగా విరిసిపోతుంటారు. చేతిలో ఏమీ లేకున్నా వేళ్లు కదుపుతూ జంధ్యాలు ఒడుకుతున్న తీరు కనబరుస్తారు.

'అలాంటి కన్నబుగత మిట్టమధ్యాహ్నంవేళ వీధిలోకి ఎందుకు వచ్చారో కదా..' అనుకుంటూ మరో సుర్కు లేకుండా ముక్కలన్నీ చాప కింద తోసేసి సూరికుచ్చారి అరుగుమీద ఉండే పేకాటబాజీలందరూ పరారీ అయ్యారు. తుపాకీ గుండుకూ దొరకనట్టుగా బాజోటు అయిపోయారు.

ఒక్క దెబ్బకి అందరూ పారెల్లిపోవడంతో లక్ష్మణ బుగతగారి అరుగు ఉన్నట్టుండి ఖాళీ అయిపోయింది. అప్పటికే నాలుగు మెతుకులు కతికి, తలకింద చేయి పెట్టుకుని, ఇంటి వరండాలో పడున్న సుగుణవల్లికి ఒక్కసారిగా అరుగు మీద పేలాపనలు ఆగిపోవడంతో ఆశ్చర్యం వేసింది.

'కర్రలు పట్టుకుని తోలినా వెళ్లని త్రాష్టులందరూ ఒకేసారి అరుగు వదిలేశారేంటబ్బా..' అనుకుంటూ మెల్లగా లేచింది. కొంగు నెత్తి చుట్టూ కప్పుకుని నిదానంగా వీధి తలుపు తీసి బయటకు వచ్చింది. గుడ్లు మిటకరించి మరీ చూసింది. ఇంకేముంది. అరుగు మీద చాప మాత్రమే ఉంది. దాని మీద పిట్టమనిషి లేదు. విచిత్రపోయింది. కొద్దిపాటి దూరంలో నెత్తిన తువ్వాలు కప్పుకుని మెల్లగా నడుచుకుంటూ వస్తున్న కన్నబుగత కనిపించారు.

'అదీ సంగతి. నంగిరి పింగిరిగాళ్లందరూ చాపమీంచి లేచిపోయింది ఇందుకన్నమాట..' మనసులోనే అనుకుంది. కొంచెం సంతోషమూ పడింది.

'మొఖాసాలన్నీ అమ్ముకు తింటున్నారు. ఇప్పటికీ ముడ్డిబద్ధకాలే. కన్నబుగతవంటి వారు అగ్రహారానికి ఒక్కరయినా ఉండాలి. లేకపోతే వీళ్ల తోలు తీసేవారెవరట..' లోలోపలే ఆనందపడింది.

**End of Preview.**

**Rest of the book can be read @**

http://kinige.com/book/Bugatalanati+Chukkapalli

* * *